క్లుప్తంగా

విద్యార్థులకు స్పోర్ట్స్ గ్లౌజుల బహూకరణ



స్పోర్ట్స్ గ్లౌజులను విద్యార్థులకు బహూకరిస్తున్న వెంకటేశ్వరరావు

రాజానగరం: దివాన్‌చెరువులోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయిలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా అదే గ్రామంలోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర వెంకటేశ్వరరావు ఆ విద్యార్థులను అభినందిస్తూ, రూ.15 వేల విలువైన స్పోర్ట్స్ గ్లౌజులను ఉచితంగా అందజేశారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నరసింహస్వామిని దర్శించుకున్న గీతాకృష్ణ



కోరుకొండలో స్వామివారిని దర్శించుకుంటున్న గీతాకృష్ణ

మధురపూడి: కోరుకొండలో శ్రీలక్ష్మీనరసింహ స్వామిని సినీ దర్శకుడు గీతాకృష్ణ శనివారం దర్శించుకున్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ ప్రాంతంతో తనకు అనుబంధం ఉందన్నారు.తన స్వగ్రామం కడియం మండలం మాధవరాయుడు పాలెమని, ఇక్కడి ఆధ్యాత్మిక ప్రాంతాల్లో నిర్మించిన సినిమాలన్నీ విజయవంతమైనట్టు వివరించారు.

త్యాగరాజ ఆరాధనోత్సవ కరపత్రాల ఆవిష్కరణ



అనపర్తిలో త్యాగరాజ ఆరాధనోత్సవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

పెదపూడి: అనపర్తిలో త్యాగరాజ ఆరాధనోత్సవ సాంస్కృతిక సమ్మేళన కార్యక్రమాలు జనవరి మూడు నుంచి పదో తేదీ వరకు జరుగుతాయని స్థానిక శారదా సంగీత కళా సమితి అధ్యక్షుడు చిన ఆదిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల కరపత్రాలను కార్యవర్గ సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలు స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జరుగుతాయన్నారు. మూడో తేదీన గాత్ర కచేరీతో ఉత్సవాలు ప్రారంభమై చివరి రోజు శాస్త్రీయ కూచిపూడి నృత్యాలతో ముగుస్తాయన్నారు. బ్రహ్మశ్రీ మాడుగుల నాగ ఫణి శర్మ, సామవేదం షణ్ముఖశర్మలు ప్రవచనం చేస్తారన్నారు. అనపర్తి పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, సమితి సభ్యులు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, మారేళ్ల ఫణి, రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, సత్తి రామారెడ్డి, శ్రీనివాసారెడ్డి, ఫణికుమార్, పాలి ఆంజనేయులు, కర్రి రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై ఎక్సైజ్ దాడులు

రంగంపేట/పెదపూడి: బెల్టు షాపులపై దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ సుధ శనివారం తెలిపారు. స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బలభద్రపురం గ్రామంలో బెల్టుషాపులపై దాడులు చేసి మల్లెల వెంకటేశ్వరరావు అనే వ్యక్తి వద్ద నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అతడిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జట్లకు కిట్ల పంపిణీ



జి.మామిడాడలో మెన్, ఉమెన్ జట్లకు కిట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో క్రీడలకు మంచి ప్రోత్సాహం ఉంటుందని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.చక్రవర్తి అన్నారు. జి.మామిడాడ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గొల్లల మామిడాడ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా ఉమెన్ జట్టుకు మూడు రోజుల శిక్షణా శిబిరం నిర్వహించారు. స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యుడు తమలంపూడి శివరామారెడ్డి సమకూర్చిన బాస్కెట్‌బాల్ కిట్లను మెన్, ఉమెన్ జట్లకు అందజేశారు. ముఖ్యఅతిథిగా జిల్లా బాస్కెట్‌బాల్ సంఘ కార్యదర్శి మణిక్యాలరావు హాజరయ్యారు. స్థానిక సంఘ అధ్యక్షుడు గొలుగూరి గౌరీ శంకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, అసోసియేషన్ కార్యదర్శి చిర్ల వెంకటకృష్ణారెడ్డి, కోశాధికారి ద్వారంపూడి యువ రాజారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

దొరికారా.. పిక్క మాయం..!

- గ్రామాల్లో కుక్కల బెడద
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



సీతానగరంలో వీధి కుక్కల గుంపు

సీతానగరం: గ్రామీణ ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పాదచారులు, వాహనచోదకుల వెంటపడి తరుముతున్నాయి. వీటి బారి నుంచి తప్పించుకునే క్రమంలో వాహన ఛోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళ పనులు ముగించుకుని ఇళ్లకు వెళ్లేవారి వెంటపడుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి.

మండల కేంద్రమైన సీతానగరంలో పాటు, వంగలపూడి, పురుషోత్తపట్నం, రామచంద్రపురం, సింగవరం, సీతానగరం, లంకూరు, చినకొండేపూడి, రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి, రాజంపేట, మునికూడలి, కాటవరం, జాలిమూడి, బొబ్బిల్లంక తదితర గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కేవలం వీధుల్లోనే కాకుండా. రాజమహేంద్రవరం – సీతానగరం ప్రధాన రోడ్డుపై వందల సంఖ్యలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆయా గ్రామాల్లో కుక్కల దాడిలో పలువురు తీవ్రంగా గాయపడిన సంఘటనలు ఉన్నాయి. రెండేళ్ల క్రితం ఒకే రోజు కుక్కలు వంగలపూడి, సింగవరం, సీతానగరంలలో 27 మందిపై దాడి చేసి, తీవ్రంగా గాయపర్చడంతో వారు ఆస్పత్రుల పాలయ్యారు. ఈ ఏడాదిలో కూడా ఒకే రోజు ముగ్గళ్ల, ఇనుగంటివారిపేటల్లో కుక్కల దాడుల్లో తొమ్మిది మంది గాయపడ్డారు. అలాగే ప్రతి రోజు ఎక్కడో ఒకచోట జనం కుక్కకాటుకు గురవుతున్నారంటే అతిశయోక్తి కాదు.

గుంపులు గుంపులుగా..

కుక్కలు గుంపులుగా సంచరిస్తుండడంతో రోడ్డుపైకి రావడానికి పెద్దలు సైతం భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, చిన్నారులపై కుక్కలు దాడులకు పాల్పడుతుండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లపై కుక్కలు రేయింబవళ్లు వాహన చోదకులను పరుగులు పెట్టిస్తున్నాయి. కుక్కల కారణంగా విద్యార్థులు బడులకు వెళ్లేందుకు కూడా భయపడుతున్నారు. ఈ ఏడాది 516 మంది కుక్కకాటు బారిన పడ్డారని వైద్యారోగ్య శాఖాధికారులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి, కుక్కల సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



పంచాయతీ అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టడం లేదు. కుక్కలు వీధుల్లో తిరుగుతూ దాడులకు తెగపడుతున్నాయి. కుక్కకాటుకు గురై జనం ఆస్పత్రులపాలవుతున్నారు. స్థానిక పీహెచ్‌సీలో వ్యాక్సిన్ వేసినా, కుక్కలు కండలు పీకివేయడంతో రాజమహేంద్రవరం ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. కుక్కలను నియంత్రించాలి.

– ఎస్ మోహన్ నాగసాయి, లంకూరు

పట్టించుకోవడం లేదు



వీధి కుక్కల బెడదపై అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా స్పందించడం లేదు. నిత్యం ఎక్కడో ఓచోట కుక్కలు దాడికి పాల్పడుతున్నాయి. కుక్కల నియంత్రణకు పంచాయతీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. వీధి కుక్కల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వెలిచేటి మోహర్‌బాబా(సిరి), పురుషోత్తపట్నం

కుష్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న వీర్రాజు

సీతానగరం: ప్రతి ఒక్కరూ కుష్టు వ్యాధిపై అవగాహన పెంపొందించుకుని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా లెప్రసీ నియంత్రణ కార్యాలయ డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ బి.వీర్రాజు వివరించారు. మండలంలోని మిర్తిపాడు జెడ్పీ హైస్కూల్లో శనివారం ఆయన కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీతానగరం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఈ ఏసురాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కుష్టు వ్యాధి వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి కాదని, మైకో బ్యాక్టీరియా లెప్రా అనే క్రిమి వల్ల వచ్చే అంటువ్యాధని చెప్పారు. శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చ రూపంలో ఇది కనిపిస్తుందన్నారు. దీనిని వెంటనే గుర్తించి, చికిత్స తీసుకుంటే పూర్తిగా తగ్గిపోతుందన్నారు. అశ్రద్ధ చేస్తే అంగ వైకల్యం సంభవిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్ఎన్ త్రినాథ్, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ బి.శైలజ, ఏఎన్ఎం బి.కుమారి, డీఈఓ బి.విజయ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రుక్మాబాయి

రాజానగరం: ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలను కలిగి, దేశాభివృద్ధిలో భాగస్వామి కావాలని రిటైర్డ్ ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ రుక్మాబాయి అన్నారు. గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, వివేకానంద కేంద్ర కన్యాకుమారి రాజమండ్రి సభ సంయుక్త ఆధ్వర్యంలో యువత నాయకత్వ లక్షణాలు అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండి ధనరాజ్ మాట్లాడుతూ, జాతి నిర్మాణంలో యువత దేశభక్తిని, సంస్కృతి, సంప్రదాయాలను ఏకీకృతం చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల మధ్య చర్చా గోష్ఠి జరిగింది. కొంతమంది విద్యార్థులు యోగాసనాలు వేసి, యోగా సాధనపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో రిటైర్డ్ విద్యాశాఖాధికారి డాక్టర్ వీకే రమణ, జి.శ్రీనివాసరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికలు



నన్నయ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఎంపికైన బాల్ బ్యాడ్మింటన్ పురుషుల జట్టు

పెదపూడి: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అనపర్తి జీబీఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్బాయిరెడ్డి తెలిపారు. అనపర్తి జీబీఆర్ కాలేజీలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటుకు పురుషుల ఎంపికలు, ముగింపు పోటీలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా అబ్బాయిరెడ్డి మాట్లాడుతూ బాల్ బ్యాడ్మింటన్ మెన్ టోర్నమెంట్ ఎంపికలు రెండు రోజుల పాటు జరిగాయన్నారు. జనవరిలో బెంగళూరులో జరిగే ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఒక జట్టును ఎంపిక చేశామన్నారు. ఈ ఎంపికలో వివిధ కాలేజీల నుంచి 6 జట్లు పాల్గొన్నాయన్నారు. కార్యక్రమంలో జీబీఆర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ స్వామి, గవర్నింగ్ బాడీ మెంబర్ జి.రామారెడ్డి, గ్రూప్ ఆఫ్ స్కూల్ డీన్ హరిప్రసాద్, సెలక్షన్ అబ్జర్వర్ డాక్టర్ మూర్తి, కమిటీ ప్రతినిధి డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సందడి

ఆట,పాటలతో గడిపిన తల్లీపిల్లలు



రాజానగరంలో సమావేశానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు



సీతానగరం హైస్కూల్‌లో హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులకు అందించిన హెచ్ఎం

రాజానగరం: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పండగ వాతావరణం నెలకొంది. పిల్లలు, పెద్దలనే తేడా లేకుండా ఆటపాటలతో అంతా సందడి చేశారు. మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌లు సాయంత్రం వరకు కొనసాగాయి. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను వారి తల్లిదండ్రులకు అందజేశారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి పాఠశాలల్లోనే భోజనాలు చేశారు.

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్ జరిగింది. హెచ్‌ఎం ఎం వీరభద్రరావు అధ్యక్షత వహించారు. ఎంపీడీవో ఎం భారతి, దాతలు పువ్వాడ కృష్ణ, రాపాక శివ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

మధురపూడి: పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దేలా సమష్టి కృషి జరగాలని ఎంఈఓ కుశలవ దొర అన్నారు. కోరుకొండ మండలంలోని 55 పాఠశాలల్లో మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. దోసకాయలపల్లి, శ్రీరంగపట్నం, గాడాల హైస్కూళ్లల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంఈఓ పాల్గొన్నారు. కోరుకొండ ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుమ్ములూరు హైస్కూల్‌లో హెచ్‌ఎం గంగాభవాని ఆధ్వర్యంలో రంగరించిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. తహసీల్దార్ సుస్వాగతం, ఏడీఏ మల్లికార్జునరావు, ఎస్సై శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని తహసీల్దార్ కోసు అనసూయ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి అధ్యక్షతన జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్‌కు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ జె. జెస్సీఫ్లోరెన్స్, పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్, ఎస్ఎంసీ చైర్మన్ గెద్దాడ దుర్గారావు, వైస్ చైర్మన్ పి.సత్యవేణి పాల్గొన్నారు.

పెదపూడి: విద్యాభివృద్ధికి మెగా పేరెంట్స్, టీచర్స్ సదస్సులు దోహదం చేస్తాయని మండల విద్యాశాఖాధికారులు–1,2 కె.సత్యనారాయణ, సీవీవీ.సత్యనారాయణలు అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్–టీచర్స్ సదస్సులకు వారితో పాటు ఎంపీడీఓ కె నరేంద్రరెడ్డి హాజరయ్యారు. అనంతరం అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి భోజనాలు చేశారు.

బిక్కవోలు: మండలంలోని అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. పందలపాక ఉన్నత పాఠశాల వద్ద మండల ప్రత్యేక అధికారి విజయకుమారి, ఎంఈవో1 సత్యనారాయణ మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల బాధ్యతతో వ్యవహరించాలన్నారు. బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థుల తల్లులకు కుర్చీ ఆటలు నిర్వహించారు.



రంగంపేటలో విశేష అలంకరణలో బాల సుబ్రహ్మణ్యస్వామి



రాజానగరంలోని సంతాన ప్రదాత సుబ్రహ్మణ్యేశ్వరుడు



ముగ్గళ్లలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



సీతానగరం ఆలయంలో స్వామివారు



నాగుల చీరలు ధరించి ఉపవాస దీక్ష చేస్తున్న మహిళలు



కోరుకొండలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

కన్నుల పండువగా షష్ఠి వేడుకలు

- వైభవంగా ప్రారంభమైన ఉత్సవాలు
- సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



లాలాచెరువు హెచ్‌బీ కాలనీలో సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శించుకుంటున్న జక్కంపూడి రాజా దంపతులు



బిక్కవోలులో గోలింగేశ్వస్వామి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

రాజానగరం: నియోజకవర్గంలో సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సంతాన ప్రదాతగా పేరొందిన రాజానగరంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శించుకునేందుకు భక్తులు వేకువజాము నుండి బారులు తీరారు.

శ్రీవల్లీ, దేవసేన దేవేరులతో కొలువుతీరిన సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయం మెట్ట ప్రాంతంలో ఇదొక్కటే కావడంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ పరిసరాలతో పాటు, గ్రామంలోని ప్రధాన రహదారిపై రద్దీ ఏర్పడింది. పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలను రాజానగరంలోకి ప్రవేశకుండా, జాతీయ రహదారిపై సూర్యరావుపేట జంక్షన్ వద్ద, ఏడీబీ రోడ్డుపై ఉన్నత పాఠశాల సెంటరులోను స్టాపర్లను ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌ని బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించారు. అలాగే కానవరంలోని సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో షష్ఠి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీకృష్ణపట్నంలో సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు వైభవంగా జరగ్గా, శ్రీరామపురంలో తొలిసారిగా నిర్వహించారు.

నాగుల చీరలు ధరించి..

సంతాన ప్రదాతగా పేరొందిన రాజానగరంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శించుకుని సంతాన భాగ్యం పొందేందుకు వివాహిత మహిళలు నాగుల చీరలు ధరించి, ఉపవాస దీక్షతో ఆలయ ప్రాంగణంలోనే ఉన్నారు. సాయంత్రం స్వామి కల్యాణోత్సవంలో తలంబ్రాలను చీర కొంగుతో పట్టుకుని, వాటిని బెల్లం, పరమాన్నంగా వండి భుజించి దీక్షను విరమిస్తారు. ఈ దీక్షను ఆచరించేందుకు ఈసారి జిల్లాలోనే కాకుండా, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి కూడా భక్తులు తరలి వచ్చారు. కాగా లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలోని సుబ్రహ్మణ్యేశ్వరుని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా దంపతులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త నండూరి సుబ్బారావు వారికి స్వాగతం పలికారు.

పోటెత్తిన భక్తులు

మధురపూడి: కోరుకొండలోని శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణం రంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అనువంశిక ధర్మకర్త మాపర్తి కృష్ణ దంపతులు పాల్గొనగా, స్వామివారి కల్యాణం జరిగింది. శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నుంచి శేష వస్త్రాలను స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. తొలుత వీరభద్రుని సంబరం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో కోరుకొండలో రద్దీ ఏర్పడింది. పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజశ్రీ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు.

అంగరంగ వైభవంగా..

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో వేంచేసి యున్న ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరిన బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో షష్ఠి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము మూడు గంటల నుంచే స్వామి వారికి ఆలయ అర్చకులు మైలవరపు నాగేంద్రకుమార్ నేతృత్వంలో అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనాలు ప్రారంభించారు. ఉదయం నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. రాత్రి బాణాసంచా కాల్పులు, విద్యుద్దీపాలంకరణలు భక్తులను అలరించాయి. మండల పరిధిలో సుభద్రంపేట, దొంతమూరు గ్రామాలలో కొలువై యున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవాలను ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఘనంగా షష్ఠి మహోత్సవం

సీతానగరం: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవం సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. సీతానగరంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, ముగ్గళ్లలోని ఉమా కొమరేశ్వరస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, రఘుదేవపురంలోని శివకేశవ ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలకు తెల్లవారుజాము నుంచి భక్తుల తాకిడి మొదలైంది. సీతానగరం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రధానార్చకుడు కొడమంచిలి రాంబాబు ఆధ్వర్యంలో, అలాగే ముగ్గళ్లలో ప్రధానార్చకుడు కొడమంచిలి ఉమాస్వామి, కొడమంచిలి విజయ్‌కుమార్, కొడమంచిలి వినేష్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణం అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఈఓ పాటి సత్యనారాయణ, ఉత్సవ కమిటీ వారి పర్యవేక్షణలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. మండలంలోని పురుషోత్తపట్నం, వంగలపూడి, ముగ్గళ్ల, మునికూడలి, బొబ్బిల్లంక, కాటవరం, రఘుదేవపురంలలో భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు చేసి, స్వామివారిని దర్శించారు. ముగ్గళ్లలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఎస్సై డి రామ్‌కుమార్‌తో పాటు, ఇద్దరు ఎస్సైలు, ఇతర సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించారు. సీతానగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సీతానగరం, ముగ్గళ్లలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పెదపూడి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకుని మానసిక ప్రశాంతత పొందాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి గ్రామం పాత ఊరు శివాలయంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు, ప్రముఖ నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి మస్తానమ్మ దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ పోతంశెట్టి శ్రీనివాసారెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు స్వాగతం పలికారు. అనపర్తిలో వీర్రాజు మామిడి వద్ద గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

షష్ఠి శోభతో కళకళలాడిన ఆలయాలు

బిక్కవోలు: బిక్కవోలు కుమార సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు తొలుత గోదావరి కాలువలో స్నానాలు చేసి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి పల్లకీ సేవ జరిగింది. బ్యాండ్ కచేరీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో మహిళా భక్తులు నాగుల చీరలు ధరించి ఆలయం వెనుక నిద్రించారు. బాణాసంచా పేలుళ్లను తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో జనం తరలి వచ్చారు. రాత్రి స్వామి గ్రామోత్సవం జరిగింది. అనంతరం అర్ధరాత్రి బాణాసంచా పోటీ జరగనుండటంతో భక్తులు పోటెత్తారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు.

పందలపాక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఉదయం రథంపై పందలపాక శివార్లో ఉన్న కాశీ అన్నపూర్ణ సమేత ఆలయం వద్ద ఉన్న తుల్యభాగ నది వద్దకు వెలమపేట రామాలయం నుంచి చెట్టును ఊరేగింపుగా తీసుకెళ్లి జలాభిషేకం చేయించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకున్నారు. కొంకుదురులో శుక్రవారం రాత్రి రమణశర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు.

బిక్కవోలు: ప్రాచీన గోలింగేశ్వర స్వామి ఆలయంలో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవం ఘనంగా జరిగింది. ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లె వాసు ఆధ్వర్యంలో జరిగాయి. తెల్లవారుజాము 1.20 గంటలకు తీర్థపు బిందె సేవతో వేడుకలు ప్రారంభమయ్యాయి. భక్తులు గోదావరి కాలువలో స్నానాలాచరించి స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి నెమలి వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, బ్యాండ్ కచేరీలు వచ్చిన భక్తులను ఆకట్టుకున్నాయి. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు తాగునీరు, చిన్నారులకు పాలు, మజ్జిగ, బిస్కట్లు, పులిహోర పంపిణీ చేశారు. పగటి పూట బాణాసంచా కాల్పులు తిలకించడానికి ఇతర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు వచ్చారు. రాత్రి స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు ఉన్నారు.



ముగ్గళ్ల ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు



బిక్కవోలులో దర్శనం కోసం క్యూలో నిలబడిన భక్తులు



బిక్కవోలులో పండ్లతో అలంకరించిన సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయం